సాక్షి మహబూబ్‌నగర్

శనివారం । 20 । జూలై । 2024



జూరాలకు కృష్ణమ్మ

కర్ణాటక ప్రాజెక్టుల నుంచి వదిలిన వరద జలాలు జూరాలకు చేరుకున్నాయి.

వివరాలు 8లో ▸



సమయపాలన పాటించాలి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని విద్యాశాఖ కమిషనర్ సూచించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 26.8 /22.7

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రయాణికుల సూచనలు పరిశీలిస్తాం: ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రయాణికుల సూచనలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ నుంచి దౌల్తాబాద్‌కు, మహబూబ్‌నగర్–యానగుందికి నైట్‌హాల్ట్ బస్సు నడపాలని పలువురు కోరారు. అలాగే నాగర్‌కర్నూల్ నుంచి జడ్చర్లకు పల్లెవెలుగు బస్సు నడపాలని, అమ్మాపూర్–వనపర్తి బస్సు సర్వీస్‌ను గోపన్‌పల్లిలో ఆపేలా చర్యలు తీసుకోవాలని, మహబూబ్‌నగర్ తిరుమలహిల్స్‌లోగల మెడికల్ కళాశాల సమీపంలో స్టాప్ బోర్డు, జడ్చర్ల సీహెచ్‌సీ హాస్పిటల్ వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల కోసం ఉదయం 8 నుంచి 9 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట సూపర్‌లగ్జరీ బస్సు నడపాలని కోరారు.

దేవరకద్ర మార్కెట్ కమిటీ ఎంపిక

- చైర్మన్‌గా కతలప్ప, వైస్ చైర్మన్‌గా హన్మంతరెడ్డి



కతలప్ప, చైర్మన్

దేవరకద్ర: స్థానిక మార్కెట్ కమిటీ కొత్త పాలక వర్గాన్ని ఎంపిక చేస్తూ శుక్రవారం అగ్రికల్చర్ అండ్ కోఆపరేటివ్ శాఖ జీఓ విడుదల చేసింది. కమిటీ చైర్మన్ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించారు. చైర్మన్‌గా చిన్నచింతకుంట మండలం కురుమూర్తికి చెందిన ఎం.కతలప్ప, వైస్ చైర్మన్‌గా దేవరకద్ర మండలం చౌదర్‌పల్లికి చెందిన ఎస్.హన్మంతరెడ్డిని ఎంపిక చేశారు. సభ్యులుగా వై.రాజేందర్‌రెడ్డి, చిన్న ఊశన్నగౌడ్, కుర్వ శ్రీనివాసులు, మొగిలన్న, బక్కరాములు, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, గోపి రామస్వామి, ఇస్లావత్ ముత్యాలమ్మ, సద్దాం హుసేన్, పీ.శ్రీనివాసులు, జీ.గోపాల్ వీరితో పాటు చిన్నచింతకుంట పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, అగ్రికల్చర్ ఏడీఏ, దేవరకద్ర పంచాయతీ ప్రత్యేక అధికారిని సభ్యులుగా నియమించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి




మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. శుక్రవారం స్థానిక పదో వార్డు పరిధిలోని క్రిస్టియన్‌పల్లిలో 'డ్రై' డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటో వస్తుందా? లేదా? అని స్థానికులతో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు ఎక్కడా ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మోరీలలో చెత్తాచెదారం వేయొద్దని స్వచ్ఛ ఆటోలకు వేరు చేసిన తడి, పొడి చెత్తను అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, మెప్మా సీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రంలో పరీక్షలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వివిధ స్వయం ఉపాధి కోర్సులకు సంబంధించి 13వ బ్యాచ్‌లో 172 మంది అభ్యర్థులకు హైదరాబాద్ సెట్విన్ ఆధ్వర్యంలో శుక్రవారం వార్షిక పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు థియరీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగాయి. పరీక్షలను డీవైఎస్‌ఓ శ్రీనివాస్, హైదరాబాద్ సెట్విన్ కోఆర్డినేటర్, ఎగ్జామినర్లు ఎండీ ఫయాజుద్దీన్, సిరిగిరి అనిత, అతియాబేగం పరిశీలించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ 13వ బ్యాచ్ విద్యార్థులకు గతేడాది మార్చి 20 నుంచి జూన్ 20 వరకు 207 మంది నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చామన్నారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సెట్విన్ వారిచే సర్టిఫికెట్లు అందిస్తామని, ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులకు త్వరలో జాబ్‌మేళా నిర్వహించి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ జయశ్రీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, రోడ్లపై దృష్టి సారించండి



- పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మున్సిపల్ కమిషనర్ రాజయ్య
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన
- సమస్యలపై ఏకరువు పెట్టిన జడ్చర్ల వాసులు

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: జడ్చర్ల పట్టణంలో ప్రధానంగా పారిశుద్ధ్యం, రోడ్లు, కుక్కల బెడద తదితర సమస్యలు పరిష్కరించాలని పట్టణవాసులు మున్సిపల్ కమిషనర్ రాజయ్యకు ఏకరువు పెట్టారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజయ్యతో 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలు వార్డుల నుంచి ఫోన్లు చేసి సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కారానికి హామీ ఇచ్చారు.

- సమస్య: కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా ఉన్నాయి. స్కూల్‌కు పిల్లలను తీసుకెళ్తుంటే పైకి ఎగబడుతున్నాయి. కుక్కలతో పిల్లలు బయట ఆడుకునే పరిస్థితి లేకుండా పోయింది.
– మమత, క్లబ్ రోడ్డు, అశోక్‌రెడ్డి, సాయినగర్‌కాలనీ
- కమిషనర్: కుక్కల బెడదపై ఫిర్యాదులు చాలానే వస్తున్నాయి. కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- సమస్య: మటన్ మార్కెట్ వద్ద చెత్తను తీసుకువచ్చి ఒకచోటే వేసి రెండు రోజులకోసారి తరలిస్తున్నారు. దీంతో ఇక్కడ డంపింగ్ యార్డులా మారింది. చెత్తను రోజు తీసేలా చూడండి.
– ఖలీల్, పాతబజార్
- కమిషనర్: చెత్తను ఎప్పటికప్పుడు తీయించేందుకు చర్యలు తీసుకుంటాం. చెత్త పోగేయకుండా రోజు తీసేలా చూస్తాం.

- సమస్య: సంతోషిమాత ఆలయం ఎదురుగా రోడ్డు పూర్తిగా పాడైంది. అలాగే బస్టాండ్ రోడ్డు నుంచి క్లబ్ రోడ్డుకు వెళ్లే రోడ్డు చాలా ఎత్తుగా వేశారు. దీంతో రాకపోకలకు కష్టమవుతుంది.
– సాహితీరెడ్డి, 24వ వార్డు
- కమిషనర్: మున్సిపాలిటీకి స్థానిక ఎమ్మెల్యే నిధులు తీసుకువస్తామని చెప్పారు. ఆ నిధులతో రోడ్ల సమస్య పరిష్కారమవుతుంది. ఆలయం ఎదురుగా నిధులు వచ్చాక రోడ్డు వేయిస్తాం. అలాగే క్లబ్ రోడ్డుకు వెళ్లేదారిని బాగు చేయిస్తాం.

- సమస్య: రోడ్లపై డబ్బాలు వేస్తున్న వీధి వ్యాపారుల వల్ల ట్రాఫిక్ జాం అవుతుంది. ఫుట్‌పాత్ లేకుండా రోడ్లను ఆక్రమిస్తున్నందున రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వాటిని తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి.
– అనిల్‌కుమార్, సామాజికవేత్త, బాదేపల్లి
- కమిషనర్: వీధి వ్యాపారులతో మాట్లాడి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఫుట్‌పాత్ ఆక్రమణలపై పరిశీలించి తొలగించేందుకు కృషిచేస్తాం.

- సమస్య: జెడ్పీ బాలికల హైస్కూల్ వద్ద రోడ్డంతా బురదమయంగా మారింది. దానిపై మొరం మట్టి వేయిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటది. అలాగే పాఠశాల చుట్టూ పారిశుద్ధ్యం లోపించింది.
– కృష్ణ, ఉపాధ్యాయుడు, బాలికల హైస్కూల్
- కమిషనర్: పాఠశాల చుట్టూ పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటాం. బురద తొలగించేందుకు ప్రాధాన్యత క్రమంలో మొరం మట్టి వేయించేలా చూస్తాం.

- సమస్య: ... ఉంది. దీంతో వర్షం పడిదంటే నీరు గుంతల్లో నిలిచి బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. చింతబావి నుంచి దోమలు ఎక్కువయ్యాయి. అలాగే కుక్కలు, కోతుల సమస్యను తీర్చండి.
– వెంకటేశ్వర్లు, శివాజీనగర్, బాదేపల్లి/– నరేష్ ముదిరాజ్, 16వ వార్డు
- కమిషనర్: ఇంజినీరింగ్ విభాగం సిబ్బందిని పంపించి రోడ్డు పరిశీలించేలా చూస్తాను. ప్రస్తుతానికి వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి చింతబావిలో దోమలు లేకుండా చూస్తాం.

- సమస్య: చెత్తబండ్లు నిర్ణీత సమయానికి రాకపోవడంతో చెత్తను ఖాళీ ప్లాట్లలో పడేస్తున్నారు. దీంతో దుర్వాసన, దోమలు వస్తున్నాయి. ఖాళీ ప్లాట్ల వారికి నోటీసులు ఇచ్చి వాటిని శుభ్రం చేయించండి. పద్మావతికాలనీలో డ్రెయినేజీ సమస్యను బాగు చేయాలి.
– రంజిత్‌బాబు, రంగారావుతోట
- కమిషనర్: చెత్తబండ్లు టైంకు వచ్చేలా చూస్తాం. చెత్తాచెదారాన్ని ఖాళీ ప్లాట్లలో వేయకుండా ప్రజలే బాధ్యత వహించాలి. ఖాళీ ప్లాట్ల విషయంలో ఏం చేయాలో కౌన్సిల్ సమావేశం అయ్యాక నిర్ణయం తీసుకుంటాం.

- సమస్య: శివాజీనగర్‌లో సీసీరోడ్డు అసంపూర్తిగా ...

- సమస్య: వర్షాలు పడుతున్నందున ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి వాటి మధ్యలో నీళ్లు నిలిచి దోమలు ఎక్కువవుతున్నాయి. పిచ్చిమొక్కలు తొలగించాలి.గౌరీశంకర్ కాలనీలో దేవిటాకీస్ దాటాక రోడ్ నం.5లో మురుగు కాల్వలు తీయడం లేదు.
– అరుణ, 13వ వార్డు, శివకుమార్, కావేరమ్మపేట, సుధాకర్, గౌరీశంకర్‌కాలనీ
- కమిషనర్: దోమల నివారణకు ఫాగింగ్ చేస్తూనే ఉన్నాం. నీరు నిల్వ ఉన్నచోట ఐబాల్స్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు తొలగించేందుకు ప్రణాళిక రూపొందిస్తాం.

- సమస్య: అంబేద్కర్ కాలనీలో చాలా రోజులుగా మురుగు కాల్వలు తీయకుండా ఉన్నారు. నీళ్లు నిలిచి దుర్వాసన వస్తుంది.
– డేవిడ్, 26వ వార్డు
- కమిషనర్: మురుగు కాల్వ శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయిస్తా.

- సమస్య: నిమ్మబావిగడ్డ రోడ్డు మధ్యలో ఇనుప స్తంభం ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
– సత్తార్, నిమ్మబావిగడ్డ
- కమిషనర్: స్తంభాన్ని మా సిబ్బందితో పరిశీలింపజేసి అవసరమైతే విద్యుత్ శాఖకు సమాచారం తీసేందుకు చర్యలు తీసుకుంటాం.

- సమస్య: పాతబజార్‌లో విఠలయ్య కిరాణం ఎదురుగా డ్రెయినేజీపై బాత్‌రూంలు నిర్మించారు. వీటితో దుర్వాసన వచ్చే అవకాశం ఉంది. రోడ్డుపై నాటిన కోనోకార్పస్ మొక్కలు ప్రమాదభరితం అంటున్నారు. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోండి.
– మురళీకృష్ణ, పాతబజార్, బాదేపల్లి
- కమిషనర్: సిబ్బందిని పంపించి పరిశీలింపజేస్తా. మురుగు కాల్వపై నిర్మాణం ఉంటే తగు చర్యలు తీసుకుని ఇబ్బందులు తొలగిస్తాం. రోడ్డుపై నాటిన మొక్కలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే తప్పకుండా తీసివేస్తాం.

- సమస్య: పద్మావతికాలనీలో నాలుగైదు స్కూళ్లు ఉన్నాయి. కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ బాగాలేదు. అలాగే ఖాళీ ప్లాట్లలో మొక్కలు పెరిగి, నీళ్లు నిలిచి దోమలు వస్తున్నాయి. రాంమందిరం ప్రాంతంలో కొన్ని రోజులుగా డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు. వెంటనే మురుగు తొలగించాలి.
– రాహుల్, పద్మావతి కాలనీ/– పవన్‌కుమార్, రాంమందిరం
- కమిషనర్: ప్రస్తుతానికి మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీకి నిధులు వచ్చాక డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తాం.

- సమస్య: క్లబ్ రోడ్డులో వంటగ్యాస్ గోడౌన్ వెనకాల ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేదు. మురుగు కాల్వ ఉన్నందున రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ప్రస్తుతం బోనాలకు వెళ్లే అవకాశం ఉన్నందున వెంటనే స్పందించాలి. –శ్రీదేవి, గోనెల రాధాకృష్ణ, మహమూద్, జడ్చర్ల
- కమిషనర్: ప్రస్తుతానికి మురుగు కాల్వ శుభ్రం చేయించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇంజినీరింగ్ సిబ్బందిని పంపించి పరిశీలించి కాల్వ సమస్య తీరుస్తాం.

నేడు మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్ ఇన్

మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు మున్సిపాలిటీ పరిధిలో సీజనల్ వ్యాధులకు సంబంధించి మహబూబ్‌నగర్, భూత్పూర్‌మున్సిపల్ కమిషనర్లతో శనివారం'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య చర్యలపై సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. అలాగే ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో నిండిపోవడం, డ్రెయినేజీ, రోడ్లు సరిగా లేకపోవడం తదితర సమస్యలను ఆయా కమిషనర్ల దృష్టికి తీసుకురావచ్చు.

మహబూబ్‌నగర్

ఫోన్ చేయాల్సిన నంబర్: **70939 11352**

తేదీ: 20.7.2024 శనివారం

సమయం: సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు



డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

భూత్పూర్

ఫోన్ చేయాల్సిన నంబర్: **81217 21965**

తేదీ: 20.7.2024 శనివారం

సమయం: ఉదయం 10 గంటల నుంచి 11.00 గంటల వరకు



సురేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి

గండేడ్: ధరణి సమస్యలపై దృష్టి సారించి, వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది ఎవరెవరు ఏఏ విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఉంటే వాటి పరిష్కారం మీద దృష్టి పెట్టాలన్నారు. జాప్యం కాకుండా పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏలను క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. వారికి సర్వే నంబర్లతో పాటు ఇతర సమస్యల గురించి అవగాహన ఉంటుందని తహసీల్దార్ నాగలక్ష్మికి సూచించారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తులు అప్‌డేట్ చేస్తున్నారా లేదా అని ఎంపీడీఓ దేవన్నను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో పరిశుభ్రత లేదని ఎందుకు ఇలా ఉంచారని ఆయుర్వేదిక్ వైద్యురాలు శిల్ప ప్రశ్నించారు. ఉన్న సిబ్బంది రిటైర్డ్ అయ్యారని ప్రైవేట్‌గా డబ్బులిచ్చి పనిచేయించుకుంటున్నామని చెప్పారు. దీంతో కలెక్టర్ డీఎంహెచ్‌ఓతో మాట్లాడతానని చెప్పారు. ఆరోగ్య కేంద్రం ఎదుట నీరు నిలుస్తుందని మట్టి వేయించాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం గండేడ్ ఎస్‌బీఐకి వెళ్లి బ్యాంకర్లతో మాట్లాడారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ అవుతున్నాయా లేదా ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టులకు ప్లాట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి కలెక్టర్‌ను కోరడంతో పరిశీలిద్దామని సమాధానం ఇచ్చారు.



గండేడ్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

మహమ్మదాబాద్: కంచన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లాలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా పరిగణించాలని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఆమె అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రంలోని వాల్ పెయింటింగ్‌పై కార్యదర్శి సుభద్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఇలాంటి బొమ్మలు ఉండటం వల్ల పిల్లలు ఎంతో శ్రద్ధగా చిత్రాలను చూస్తూ ఉంటారని, ఆకర్షితంగా ఉన్నందుకు పిల్లలు ఎక్కువగా వచ్చేవారని కార్యదర్శి తెలిపారు. దీనికి ఖర్చు చేసిన రూ.1.55 లక్షలు ఇంకా రాలేదని కలెక్టర్‌కు తెలపగా..ప్రత్యేక నిధులను వెంటనే విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌గా విజయజ్యోతి



స్టేషన్ మహబూబ్‌నగర్: పోస్టల్ డిపార్ట్‌మెంట్ మహబూబ్‌నగర్ డివిజన్ సూపరింటెండెంట్‌గా ఎస్.విజయజ్యోతి శుక్రవారం జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కర్నూలు డివిజన్ నుంచి బదిలీపై ఆమె మహబూబ్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

యువజన కాంగ్రెస్‌లో ఎన్నికల సందడి

- ఆన్‌లైన్ ద్వారా ఎన్నికల నిర్వహణ
- అసెంబ్లీ, మండల స్థాయిలోనూ హడావుడి
- నేడు నామినేషన్లకు చివరి తేదీ

స్టేషన్ మహబూబ్‌నగర్: యువజన కాంగ్రెస్‌లో ఎన్నికల సందడి నెలకొంది. 2020 డిసెంబర్‌లో యువజన కాంగ్రెస్ విభాగానికి ఆన్‌లైన్ వేదికగా ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు ఎన్నికల జరిగాయి. నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఆన్‌లైన్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈనెల 9వ తేదీన సభ్యత్వ నమోదు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. శనివారం నామినేషన్‌కు చివరితేదీ, 21న అభ్యంతరాలకు అవకాశం, 22 నుంచి 26 వరకు నామినేషన్ల స్క్రూట్నీ, 28న బరిలో ఉండే అభ్యర్థుల ప్రకటన, వచ్చేనెల 5 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మెంబర్‌షిప్ (ఎన్‌రోల్‌మెంట్) చేసుకునే అవకాశం ఉంటుంది. 18 నుంచి 35 ఏళ్ల వారికి మెంబర్‌షిప్ చేసుకోవచ్చు. అభ్యర్థి వరుస సంఖ్యను సూచిస్తూ మెంబర్‌షిప్ చేసుకుంటారు. ఇలా ఏ అభ్యర్థికి ఎక్కువ మెంబర్‌షిప్‌లు వస్తాయో వారే అధ్యక్షుడిగా, ఇతర పదవులకు ఎంపిక కానున్నారు.

మండలస్థాయి నుంచి ఎన్నికలు

ఈసారి మండలస్థాయి నుంచి ఎన్నికలు జరగనున్నాయి. మండల కమిటీ, అసెంబ్లీ, జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలస్థాయి కమిటీలో 17 మంది, అసెంబ్లీస్థాయిలో 27 మంది, జిల్లాస్థాయిలో 27 మందితో కమిటీని ఎన్నుకోనున్నారు. అయితే ఆయా కమిటీల్లో రిజర్వేషన్ల ప్రకారం అన్ని వర్గాల వారికి అవకాశం కల్పించనున్నారు.

జిల్లా అధ్యక్ష పదవికి పోటాపోటీ

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో చాలామంది యువజన కాంగ్రెస్ నాయకులు పదవులను దక్కించుకోవడానికి పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. ఈసారి ఎన్నికల్లో నిలబడడానికి చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా జిల్లా అధ్యక్ష పదవికి ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ నామినేషన్లు వేశారు. వీరి ద్దరు కొన్నేళ్ల నుంచి ఎన్‌ఎస్‌యూఐ విభాగంలో చురుగ్గా పనిచేస్తున్నారు. జిల్లా అధ్యక్ష పదవికి వీరిద్దరి మధ్యనే పోటీ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా అసెంబ్లీ, మండలస్థాయి, అర్బన్ ప్రాంతాల అధ్యక్ష పదవులకు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు నామినేషన్లు వేశారు.

రెండోరోజు 25 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలో రెండోరోజు జరిగిన డీఎస్సీ పరీక్షలకు 25 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం వేళ ఫాతిమా విద్యాలయం పరీక్షకేంద్రంలో 184 మందికి 172 మంది హాజరు కాగా.. 12 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం వేళ 185 మందికి 182 మంది హాజరయ్యారు. జేపీఎన్‌సీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఉదయం 180 మందికి 173 మంది, మధ్యాహ్నం 181 మందికి 178 మంది హాజరయ్యారు. కాగా.. జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల డీఎస్సీ పరీక్ష కేంద్రాన్ని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.నరసింహారెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. పరీక్ష నిర్వహణలో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, లోటుపాట్లు లేకుండా పరీక్ష నిర్వహించాలని అధికారులకు సూచించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



ఆర్బీఐ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ రాధిక భరత్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రస్తుతం ఆన్‌లైన్ లావాదేవీలు ఎంతో కీలకంగా మారాయని, వాటిపై ప్రతిఒక్కరు కూడా పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్ ఆర్బీఐ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ రాధిక భరత్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూపీఐ పేమెంట్, కొత్తగా వచ్చే ఆన్‌లైన్ లింక్‌లు, ఫోన్ కాల్స్‌పై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ వ్యవహారాలు కేవలం బ్యాంకులు మాత్రమే చూస్తాయని, బయటి వ్యక్తులకు వాటిపై అవగాహన ఉండదన్నారు. ఆన్‌లైన్ వ్యవహారాలు నిర్వహించే వారు తరచుగా పిన్ నంబర్ మార్చాలని, ఆన్‌లైన్ ట్రాన్సక్షన్ చేస్తే తప్పకుండా రిసిప్ట్ తీసుకోవాలని, ఐఎఫ్‌సీఐ కోడ్ ఉన్న బ్యాంకుల్లో మాత్రమే లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండి సమస్యలు వస్తే వెంటనే సైబర్ క్రైం వారికి ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో ప్రిన్స్‌పాల్ విజయ్‌కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్, బాబురావు, సీనియర్ అసిస్టెంట్ రెహమాన్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా బెల్లం సీజ్

- ఇద్దరు అరెస్ట్

- వివరాలు 8లో..

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళ మృతి


జంగిలమ్మ (ఫైల్)

కేటీదొడ్డి: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం కేటీదొడ్డి మండలంలోని చోటు చేసుకుంది. బంధువుల వివరాల మేరకు.. మండలంలోని గంగన్‌పల్లికి చెందిన గిర్ని జంగిలమ్మ (46) తమ వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసుకున్న పశువుల షెడ్డు వద్ద కట్టేసిన గేదెను విడిచి బయటకు తీసుకొస్తోంది. ఆ సమయంలోని ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పశువుల షెడ్డుకు విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు వారు తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు.

చర్లగార్లపాడులో రైతు..

మల్దకల్: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని చర్లగార్లపాడులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయ గూని నల్లన్న (45) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల రెండు మేకలను కొనుగోలు చేశాడు. శుక్రవారం సాయంత్రం మేత కోసం పొలానికి వెళ్లి విద్యుత్ స్తంభం సమీపంలో గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. నల్లన్నకు భార్య జయమ్మ, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సురేష్(ఫైల్)

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటకు చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వడ్ల సురేష్(32) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈనెల 11న జానంపేట గ్రామానికి చెందిన ఇద్దరు పిల్లలను హాస్టల్‌లో వదిలి పెట్టేందుకు వారి తల్లిదండ్రులతో కలిసి కల్వకుర్తికి ఆటోలో బయలుదేరాడు. కల్వకుర్తి సమీపంలోని సూర్యలక్ష్మీకాటన్ మిల్లు వద్ద వెళ్తున్న సమయంలో ఉన్నట్లుండి ఆటో ఇంజన్‌లో సమస్య ఏర్పడి ఒక్కసారిగా ఆటో బోల్తాపడింది. అందులో ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సురేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం చాయలు అలుముకున్నాయి. సురేష్‌కు భార్య మానస, కుమారుడు నర్సింహ, కుమార్తె సరోజ ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేసు డైరీని అందజేయండి

- బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వనపర్తి జిల్లాలో సంచలనం సృష్టించిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్యలో కేసు డైరీని అందజేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి మేలో హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా, పోలీసులు కేసును సరిగా దర్యాప్తు చేయడం లేదని, నిందితులను పట్టుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని మృతుడి తండ్రి శేఖర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'మే 23న నా కుమారుడిని గొడ్డలి లాంటి ఆయుధంతో అత్యంత దారుణంగా హత్య చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీలో శ్రీధర్‌కు శత్రువులున్నారు. ప్రస్తుతం కేబినెట్ మంత్రిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే దర్యాప్తును అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. దోషులకు సాయం చేయడంలో భాగంగా దర్యాప్తు జాప్యం జరిగేలా చూస్తున్నారు'అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. హత్య జరిగి నెల రోజులు దాటినా పోలీసులు ఒక్క అరెస్టు కూడా చేయలేదన్నారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కనుసన్నల్లో దర్యాప్తు సాగుతోందని అన్నారు. ఇలాంటి దర్యాప్తుతో ప్రజలకు పోలీసులపై విశ్వాసం పోతుందని చెప్పారు. కాగా, పోలీసులు ఎలాంటి పక్షపాతం లేకుండా దర్యాప్తు జరుపుతున్నారని, విచారణ పెండింగ్‌లో ఉందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న న్యాయమూర్తి.. కేసు డైరీని నాలుగు వారాల్లోగా సమర్పించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించారు.

జూరాలకు చేరిన కృష్ణమ్మ

ఎగువ నుంచి 67 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జూరాల జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం

ధరూర్/ దోమలపెంట/ మదనాపురం/ ఆత్మకూర్: ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి వదిలిన వరద జలాలు శుక్రవారం జూరాలకు చేరుకున్నాయి. ప్రాజెక్టుకు వారం రోజులుగా 2– 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం సాయంత్రం 67 వేల క్యూసెక్కులు వచ్చింది. ఈ వర్షాకాలంలో ఇంత పెద్దఎత్తున వరద రావడం ఇదే మొదటిసారి. దీంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లను ప్రారంభించి విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. అలాగే జూరాల కుడి, ఎడమ కాల్వలకు సాగునీటిని విడుదల చేయడంతోపాటు ఎత్తిపోతల పథకాలను కొనసాగించి రిజర్వాయర్లు నింపుతున్నారు. రైతులకు కాల్వల ద్వారా సాగునీరందించాల్సి ఉండటంతో ముందస్తుగా రిజర్వాయర్లను నింపుతున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలలో రెండు పంపుల ద్వారా నీటి పంపింగ్ కొనసాగిస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. కొనసాగుతున్న నెట్టెంపాడు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 34,818, ఆవిరి రూపంలో 78, భీమా లిఫ్టు–1కు 1300, లిఫ్టు–2కు 750, ఎడమ కాల్వకు 870, కుడి కాల్వకు 367, సమాంతర కాల్వకు 600 క్యూసెక్కులు కలిపి మొత్తం ప్రాజెక్టు నుంచి 39,533 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.523 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 61,138 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 65 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 97.227 టీఎంసీల నిల్వ ఉంది. అలాగే నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. 22 క్రస్టు గేట్లను ఎత్తి 68,810 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.31 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 30.348 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రామన్‌పాడు జలాశయంలో..

రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎన్టీఆర్ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 844, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 808.4 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 808.4 అడుగుల వద్ద 33.3895 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 32,673 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి వదిలారు. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 7,063 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో స్థానికంగా 1.60 మి.మీ., వర్షపాతం నమోదైంది. జలాశయంలో 54 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

వేగవంతంగా విద్యుదుత్పత్తి

జూరాలలోని దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. శుక్రవారం 11 యూనిట్ల ద్వార విద్యుదుత్పత్తి చేపడుతునట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 5.086 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని చెప్పారు.

కృష్ణానదికి పెరుగుతున్న వరద

- నదీతీర ప్రాంతాలకు హెచ్చరికలు జారీ

కృష్ణా: కర్ణాటకలోని నారాయణపూర్ జలాశయం నుంచి 95 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండటంతో కృష్ణానది తీరాన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం ఎస్ఐ ఎండీ నవీద్ విలేకరులతో మాట్లాడుతూ.. 2019, ఆగష్టు 9న రాత్రి సమయంలో అకస్మాత్తుగా వరదలు రావడంతో పలు గ్రామాల ప్రజలు పడ్డ కష్టాలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. ఆ పరిస్థితి పునరావృతం కాకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నదీతీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కర్ణాటక అధికారులు ఇక్కడి అధికారులకు సమాచారం ఇవ్వడంతో మక్తల్ సీఐ స్థానిక పోలీసులకు తగిన సూచనలు చేశారు.


వాసునగర్ పుష్కరఘాట్ వద్ద కృష్ణానది ఉధృతి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నరసింహారెడ్డి

- డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.నరసింహారెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని.. 10 నిమిషాల ముందే పాఠశాలలకు చేరుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఏనుగొండ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, భోజనం వడ్డించే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏజెన్సీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో కనీస అభ్యర్థన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. శుక్రవారం జరగనున్న తల్లిదండ్రుల సమావేశానికి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను ఆహ్వానించాలని, పాఠశాల అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని డీఈఓను అడిగి తెలుసుకున్న ఆయన పనులు వీలైనంత తర్వాత పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. బడిలో చదివే ప్రతి విద్యార్థికి తప్పకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ వెంకటనరసమ్మ, సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీరుస్తాం..

మాగనూర్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుస్తామని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మందిపల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ మయంక్ మిట్టల్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో 180 మంది విద్యార్థులు ఉండగా.. కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నట్లు దినపత్రికల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. పాఠశాలలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల కొరతను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్‌కు సలహాలు, సూచనలు చేస్తూ సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి ఇటీవల జరిగిన పదోన్నతుల్లో పీఎస్‌హెచ్‌ఎంగా వెళ్లిన తిమ్మన్న టీచర్‌ను తిరిగి మందిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని అడిషనల్ కలెక్టర్‌ను ఆదేశించారు. సత్వరమే పాఠశాలకు ఏడు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరలో పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆయన వెంట శిక్షణ కలెక్టర్ గరీమ నారుల, డీఈఓ అబ్దుల్ ఘని, ఏఎంఓ విద్యాసాగర్, జీహెచ్‌ఎం మురళీధర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పౌర్ణమిని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నుంచి అరుణాచలం గిరి క్షేత్రానికి వెళ్లే టూర్ ప్యాకేజీ ప్రత్యేక బస్సులను శుక్రవారం రాత్రి స్థానిక బస్టాండ్ ఆవరణలో రీజినల్ మేనేజర్ శ్రీదేవి ప్రారంభించారు. ముందుగా పూజలు నిర్వహించారు. ఆర్ఎం మాట్లాడుతూ అరుణాచలం గిరి ప్రదక్షణకు మహబూబ్‌నగర్ డిపో నుంచి 3, నాగర్‌కర్నూల్ డిపో నుంచి 2, షాద్‌నగర్ డిపో నుంచి ఒక బస్సు బయలుదేరినట్లు తెలిపారు. ఈ బస్సులు శనివారం సాయంత్రానికి అరుణాచలం చేరుకుంటాయని తెలిపారు. దారిలో కాణిపాకం, వెల్లూర్ గోల్డెన్‌టెంపుల్ దర్శనం ఉంటుందని చెప్పారు. తిరిగి 21న సాయంత్రం బయలుదేరి 22న ఉదయం ఆయా పట్టణాలకు చేరుతాయని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ లక్ష్మీధర్మ, పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగులు బసప్ప, భానుప్రకాష్‌రెడ్డి, శర్మ, బాలస్వామి, వీఎస్.రావు, శ్యాంసుందర్, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.



భారీగా బెల్లం సీజ్

- 1,500కేజీల బెల్లం, 40కేజీల పటిక, నాలుగు లీటర్ల సారా స్వాధీనం
- నాలుగు జిల్లాలకు బెల్లం రవాణా చేసే ఇద్దరు అరెస్టు


సీజ్‌చేసిన బెల్లం, వాహనం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వం ఆగస్టు 31నాటికి రాష్ట్రంలో నాటుసారాను నిర్మూలించాలనే లక్ష్యంతో ఉంది. దీనికి అనుగుణంగా ఎక్సైజ్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు సారా తయారీని కట్టడి చేయడానికి ప్రత్యేక కసరత్తు ప్రారంభించారు. గతంలో ఉమ్మడి జిల్లాలో సారా తయారీ దాదాపు కట్టడి చేసినా ఇంకా కొన్ని ప్రాంతాలు, తండాల్లో తయారీ ఆగలేదు.

బెల్లం రవాణాదారులు అరెస్ట్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ పోలీసులతో పాటు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు మార్గంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు చేస్తున్న తనిఖీల్లో భాగంగా చాలాకాలంగా కర్ణాటక నుంచి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, మహబూబాబాద్‌కు బెల్లం రవాణా చేసే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు 1,500 కేజీల బెల్లం, 40 కేజీల పటిక, నాలుగు లీటర్ల సారా, వాహనం సీజ్ చేశారు. సూర్యపేట జిల్లా బాగుగూడెంకు చెందిన గొల్ల రవి, మహబూబ్‌నగర్‌కు చెందిన ఉపేంద్రచారి కొన్ని రోజుల నుంచి నాలుగు జిల్లాలకు సారా తయారీకి అవసరమైన బెల్లం కర్ణాటక నుంచి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణరెడ్డి, శారద, ఎస్ఐ సృజన్‌రావు సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక నిఘా

పాలమూరులో సారా తయారీదారులతో పాటు బెల్లం విక్రయాలపై కూడా పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి వెల్లడించారు.

ఉద్యోగాల్లో స్థిరపడాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు తమ చదువులు పూర్తి చేసుకున్న వెంటనే ఉద్యోగాల్లో స్థిరపడాలని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పీయూ ఎంబీఏ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువు పూర్తి అయ్యాక ఒకరికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో ఉండాలని, ఉద్యోగం కోసం ఎదురుచూడవద్దని సూచించారు. అందుకోసం స్టార్టప్‌లు ఏర్పాటు చేసి, జీవితంలో ఎదిగే విధంగా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓడీ నాగసుధ, అర్జున్‌కుమార్, జావేద్, అహ్మద్, అరుంధతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి



వనపర్తి పోస్టాఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

వనపర్తి టౌన్: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం వనపర్తి డివిజన్ కార్యదర్శి శివకుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక సమాఖ్య పిలుపుమేరకు శుక్రవారం మధ్యాహ్నం భోజన సమయంలో పోస్టాఫీస్ ఎదుట ఉద్యోగులు, కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, ఇప్పటికే నియమించి ఉంటే 2026 జనవరి 1 నుంచి కొత్త వేతనాలు పొందేవాళ్లమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎగ్గొట్టిన, ఉద్యోగులు హక్కుగా పొందాల్సిన 18 నెలల కరువు భత్యం ఓ కలగా మిగిలిపోయిందని, 18 నెలల కరువు భత్యం వెంటనే చెల్లించాలని, పూర్తి పెన్షన్‌ను 12 ఏళ్లకు పునరుద్ధరించాలన్నారు. కారుణ్య నియామకాల్లో 5 శాతం పరిమితి తొలగించాలని, ప్రభుత్వ విభాగాల్లోని అన్ని ఖాళీలను భర్తీ చేయాలని, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగ విధానానికి స్వస్తి పలకాలన్నారు. ఉద్యోగ, కార్మిక సంఘాలతో ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలని, సంయుక్త సంప్రదింపుల విధానాన్ని గౌరవించాలని చెప్పారు. ఉద్యోగ సంఘాలు, సమాఖ్యలను గుర్తించాలని, ఎన్ఎఫ్‌పీఈ, ఐఎస్ఆర్వోఎస్‌పీ సంఘాల రద్దు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని, 15(1)(సీ) నిబంధనలు ఉద్యోగ సంఘాలకు వర్తింపజేయకూడదని డిమాండ్ చేశారు. ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగుల నియామకాలను వెంటనే క్రమబద్ధీకరించాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులందరినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు గణేష్, రేణుక, సాయికుమార్, మహేష్, అమీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

'జోగుళాంబ' సన్నిధిలో టూరిజం శాఖ ఎండీ


ప్రసాద్ స్కీం భవనాన్ని పరిశీలిస్తున్న టూరిజం శాఖ ఎండీ ప్రకాష్ రెడ్డి

అలంపూర్ రూరల్: జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం టూరిజం శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, అర్చకులు స్వాగతం పలికారు. బాల బ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ దేవి ఆలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసదాలను అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ప్రసాద్ స్కీం భవనం పరిశీలించారు.

ఆన్‌లైన్ టెండర్ల కేటాయింపు

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల ఆన్‌లైన్ సీల్డ్ కవర్ల టెండర్లను శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ శ్రీనివాస రాజు, ఈఓ పురేందర్‌కుమార్ సమక్షంలో తెరిచారు. ఆలయాలకు సంబంధించిన వివిధ టెండర్లను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. టెండర్ సమయం ఏడాది పాటు ఉంటుందని ఈఓ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గండేడ్: కుటుంబ కలహాల వల్ల పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గండేడ్ మండలంలోని పగిడ్యాల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. పగిడ్యాల్ చెందిన కావలి అంజిలమ్మ (21) కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకొని ఆమెను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మళ్లీ చిరుత దాడి: మూడు దూడలు మృతి

- భయం గుప్పిట్లో ఎల్కిచర్ల గ్రామస్తులు

భూత్పూర్: ఇటీవల చిరుత దాడిలో దూడ మృతి చెందిగా, మళ్లీ గురువారం రాత్రి మూడు దూడలు మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్కిచర్లలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గద్దల బాలప్ప పశువుల పాకలో గురువారం రాత్రి రెండు దూడలు, చెన్నారెడ్డి పశువుల పాకలో ఉన్న దూడ చిరుత దాడిలో మృతి చెందాయి. రెండు రోజుల వ్యవధిలో నాలుగు దూడలు చిరుత దాడిలో మృతి చెందడంతో పాటు గ్రామానికి అర కిలోమీటర్ దూరంలో చిరుత సంచరిస్తుందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ అధికారి నిరంజన్, బీట్ ఆఫీసర్ రాఘవేందర్‌రెడ్డి మృతిచెందిన దూడలను పరిశీలించారు. మండల పశువైద్యాధికారి మధుసుదన్ వాటికి పోస్టుమార్టం నిర్వహించారు. పాదాల గుర్తులను బట్టి చిరుత లేదా హైనా దాడి చేసి ఉండోచ్చని, పాదాల ముద్రలను మన్ననూర్ ఫారెస్టు అధికారులకు గుర్తించేందుకు పంపించినట్లు సెక్షన్ ఆఫీసర్ తెలిపారు. గురువారం సాయంత్రం ఖిల్లాఘణపురం మండలం మామిడిమాడ సమీపంలో లైన్‌మన్‌కు చిరుత కనిపించిన వార్తలు రావడంతో, మామిడిమాడ నుంచి ఎల్కిచర్లకు చిరుత రావచ్చనే అనుమానం గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు.


దూడను పరిశీలిస్తున్న సెక్షన్ ఆఫీసర్ నిరంజన్

మేకల మందపై చిరుత దాడి

బిజినేపల్లి: మండలంలోని మిట్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని భీమునితండా అటవీ సమీపంలో శుక్రవారం ఉదయం మేకల మందపై చిరుత దాడి చేసింది. స్థానికుల సమాచారం మేరకు.. భీముని తండా అటవీ ప్రాంతంలో శ్రీనునాయక్, రవిలు మేకల మందను మేపులకు తీసుకెళ్లారు. అటుగా ఒక చిరుత వచ్చి మందలో మేకపై దాడి చేసింది. వెంటనే శ్రీను, రవిలు గట్టిగా కేకలు వేయడంతో చిరుత భయపడి పారిపోయింది. ఎలాంటి ప్రాణహాని జరగలేదు. చిరుత ఘన్‌పూర్ మండలంలోని అటవీ ప్రాంతం నుంచి ఇటు బిజినేపల్లి అటవీ శివారులోకి వచ్చి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కూలీ పనులకు తీసుకెళ్లి..

ఇద్దరు మహిళలపై అత్యాచారం

అచ్చంపేట రూరల్: కూలీ పని కోసం తీసుకెళ్లి ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూర్ మండలంలోని రెండు వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలు అచ్చంపేటలో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. ఈనెల 18న పని కోసం అచ్చంపేటకు వచ్చారు. ఇళ్లల్లో నేలబండలు శుభ్రం చేసే పని ఉందని, అచ్చంపేటకు చెందిన ఇద్దరు బండల వ్యాపారులు ఇద్దరు మహిళలను తమ వెంట తీసుకెళ్లారు. సాయంత్రం వరకు ఇళ్ల, బండలను శుభ్రం చేయించారు. అనంతరం కారులో వారిని ఎక్కించుకొని నల్లగొండ జిల్లా డిండి వైపు తీసుకెళ్లి తమతో పాటు ఇద్దరు మహిళలకు మద్యం తాగించి బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డారు. అపస్మారకస్థితిలో ఉన్న మహిళలను అచ్చంపేట అటవీశాఖ కార్యాలయం సమీపంలో వదిలి వెళ్లిపోయారు. మహిళల పరిస్థితిని గమనించిన స్థానికులు 100, 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. మహిళలను ఆస్పత్రికి తీసుకెళ్లి, అపస్మారకస్థితి నుంచి తేరుకున్న తర్వాత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవాబుపేట: మండలంలోని చాకలపల్లి పరిధిలోని నాగమ్మగడ్డతండాలో తాళం వేసిన ఇంట్లో నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గిరిజనతండాకు చెందిన సభవత్ రాజు గతనెల భార్య కాశిబాయిని ఇంటి దగ్గర ఉంచి, పిల్లలతో ముంబాయికి జీవనోపాధికి వెళ్లాడు. ఈ నెల 10వ తేదీన కాశిబాయి కూడా ఇంటికి తాళం వేసి ముంబాయికి వెళ్లింది. ఈ నెల 17న తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిందని, తాళం బయట పగులగొట్టి ఉండడంతో చుట్టుపక్కల ముంబాయిలో ఉన్న రాజుకు సమాచారం అందించారు. దీంతో శుక్రవారం గ్రామానికి వచ్చిన రాజు ఇంట్లో చూడగా రూ.60 వేల విలువైన వెండి, బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.